

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

యాలాల, ఏప్రిల్ 28: రైతులు వ్యాపారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరలు పొందాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. ఆదివారం రాస్నంలో కొనుగోలు కేంద్రాలను నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోకి కొందరు దళారులు వచ్చి రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.

ప్రశాంతంగా గురుకుల విద్యాలయాల
ప్రవేశ పరీక్షలు

వికారాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల సంస్థ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లాలో మొత్తం 13 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించగా, వికారాబాద్‌లో ఆరు కేంద్రాలు, పరిగిలో ఏడు కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్షలు జరిగాయి. జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి 1,707 మంది అభ్యర్థులను కేటాయించగా, వారిలో 1,514 మంది హాజరయ్యారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి 1,344 మంది అభ్యర్థులను కేటాయించగా, వారిలో 1,110 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 88.69శాతం హాజరు నమోదు కాగా, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 82.58 శాతం హాజరు నమోదైందని ఎంజేపీటీబీసీడబ్ల్యుఆర్ఈఐఎస్ జిల్లా కన్వీనర్ వెంకట్‌రావు తెలిపారు.

ఓటర్ల సంఖ్య పరంగా దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా పేరుగాంచిన మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో గెలిచేందుకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ముఖ్యంగా మొన్నటి వరకూ ఇక్కడ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ స్థానంలో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల్లోని అసంతృప్త నేతలను, క్యాడర్‌ను హస్తం పార్టీలో చేర్చుకొని పార్టీకి బలాన్నిచ్చే చర్యలు చేపడుతున్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను చేర్చుకునేందుకు దృష్టిపెడుతున్నారు. కాగా మోదీ ప్రభతో గెలవాలని బీజేపీ చూస్తోంది. పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ సీనియారిటీ తమకు అనుకూలం అని భావిస్తోంది. ఇదిలా ఉంటే మొన్నటి దాకా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఇక్కడ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తోంది. నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేల బలాన్ని, బలగాన్ని ఇందుకు వినియోగించుకుంటోంది!



టార్గెట్ మల్కాజిగిరి!

- ఇక్కడ గెలుపు కాంగ్రెస్, బీజేపీలకు ప్రతిష్ఠాత్మకం
- క్యాడర్ బలంతో నెగ్గే ఆలోచనలో బీఆర్‌ఎస్
- సొంత పార్టీ ఎమ్మెల్యే తీరుతో కారు పార్టీలో గుబులు!

అన్ని పార్టీల ఫోకస్ ఈ నియోజకవర్గంపైనే..

మేడ్చల్ ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటర్ల సంఖ్య పరంగా దేశంలోనే అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గం. విభిన్న ప్రాంతాల ప్రజలతో మమేకమైన మల్కాజిగిరి పార్లమెంటుపై జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మల్కాజిగిరిలో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించిన పార్టీల అగ్రనేతలు మల్కాజిగిరి స్థానంపై ప్రత్యేక దృష్టిసారించారు. దేశంలోనే పెద్ద నియోజకవర్గం కావడం, 37.28లక్షల ఓటర్లున్న నేపథ్యంలో ఎలాగైనా గెలిచి తమ పట్టు నిలుపుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందుబాటులో అన్ని వనరులను ఒడ్డుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మొన్నటి వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీగా వ్యవహరించిన ఈ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యూహంలో భాగంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌ల్లోని అసంతృప్త నేతలను పార్టీలో చేర్చుకొని తమ పార్టీకి ఓటింగ్ శాతాన్ని పెంచుకోవాలని కార్యాచరణ అమలు చేస్తున్నారు. అధికంగా ఉన్న పట్టణ ప్రాంత ఓట్లు పొందాలని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతూ పార్టీ కండువాలు కప్పుతున్నారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకున్నారు. దీనితో పాటు మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లను హస్తగతానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 37.28 లక్షల మంది ఓటర్లుండగా కుత్బుల్లాపూర్, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిల్లో 19.5లక్షల మంది ఓటర్లున్నారు. ఈ మూడు నియోజకర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

మల్లారెడ్డి మాటలతో క్యాడర్‌లో అయోమయం!

కాగా కొన్ని రోజుల కింద మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాటలతో బీఆర్‌ఎస్ క్యాడర్లో అయోమయం నెలకొంది. పోటీలో ఉన్న ప్రత్యర్థితో 'నువ్వే గెలుస్తున్నవ్' అని బహిరంగంగా చెప్పడంతో మన పరిస్థితి ఏమిటని బీఆర్‌ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. నిజంగానే బీజేపీ అభ్యర్థి గెలుస్తారనే ఆయన అలా అన్నారా? లేక యాదృచ్ఛికంగానే అన్నారా? అనేది పక్కనబెడితే స్వయంగా ఎమ్మెల్యేనే బీజేపీ అభ్యర్థితో 'నువ్వే గెలుస్తున్నవ్' అని చెప్పడం దేనికి సంకేతం? అని రాజకీయంగా చర్చ మొదలైంది. అంటే బీజేపీనే గెలుస్తుందని ఎమ్మెల్యే భావిస్తున్నారా? అని బీఆర్‌ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. ఎదుటి పార్టీనే గెలుస్తుందనే ముందే అంటే సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆత్మవిశ్వాసంతో ప్రచారం ఎలా చేయగులుగతారనే చర్చా నడుస్తోంది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తీరుపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే మల్లారెడ్డి బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చేందుకు కుట్ర చేస్తున్నాడని, భవిష్యత్తులో ఆయన పార్టీ మారే ఆలోచనతోనే ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని బీఆర్‌ఎస్‌లోని కొందరు నాయకులు చెవులు కొరుక్కొంటున్నారు.



ఓటమి చెందిన నియోజకవర్గాల్లో..

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా ఏడింట్లోనూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓడింది. ఓడిన ఈ స్థానాల్లో పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది. ఇతర పార్టీల నుంచి వలసలను ప్రోత్సహిస్తోంది. ఈ 7 నియోజకవర్గాల్లో చేరికల కోసం ప్రత్యేకంగా కమిటీలను నియమించారు. బలమైన సామాజికవర్గాలకు చెందిన నేతలు పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తోంది. పీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సైతం ఇతర పార్టీల నాయకులను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలోనే చేరికలు జరుగుతున్నాయి. ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు సైతం చేరేందుకు సిద్ధంగా ఉన్నా స్థానిక నేతల వ్యతిరేకతతో ఇన్నాళ్లు చేరికలు ఆగాయి. ప్రస్తుతం పీసీసీ ఆదేశాలు, నిర్దేశాలతో చేరికలు ఊపందుకున్నాయి. బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన నేతలు సైతం హస్తం కండువా కప్పుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ తనదైశన శైలిలో ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. నామినేషన్ రోజు కేంద్ర మంత్రులతో కలిసి సభ నిర్వహించి క్యాడర్లో జోష్ నింపారు. దేశంలో మోదీ ప్రభుత్వం ఉండాలంటూ ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థి సైతం ప్రచార వేగాన్ని పెంచారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా ఎందుకో ఆయన, పార్టీ నాయకులు చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రచారం నిర్వహించడం లేదు. కారు పార్టీ ప్రచారంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంటే వెనుకంజలోనే ఉంది. అయితే బీఆర్‌ఎస్‌కు అన్నిచోట్లా క్యాడర్ ఉండటం కలిసొచ్చే అంశం.



ఊటువల్లి తండాలో వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న మహిళలు

తాగునీటి కోసం తండ్లాట!

దోమ, ఏప్రిల్ 28 : మండలంలోని ఊటువల్లి తండాలో తాగునీటి కోసం తండా వాసులు అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ తాగునీరు వారంలో ఒక రోజు సరఫరా కావడంతో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్‌లో భూగర్భ జలాలు అడుగంటి సరిపడే నీరు రావడం లేదు. దీంతో తండావాసులు నీటి కోసం తండ్లాడుతున్నారు. ఎక్కడా తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

తాగునీటి కోసం రోజూ ఇబ్బంది పడుతున్నాం

తండాలో ఉన్న సింగిల్‌ఫేజ్ బోరులో సరిపడే నీరు రావడం లేదు. రోజూ మేం తాగునీటి కోసం తెల్లవారుజాము నుంచే బోరు వద్ద బిందెలతో బారులు తీరుతున్నాం. తండాలో ఉన్న ఉన్న బోరు నీరు సరిపోక వ్యవసాయ బోర్ల వద్దకు పోయి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు తండాలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
- రమణిబాయి, ఊటువల్లి తండా

నిధులు దుర్వినియోగం చేసిన
ఉద్యోగి డిస్మిస్!

- విధుల నుంచి తప్పించిన మున్సిపల్ కమిషనర్
- బల్దియాలో రూ.25లక్షల కుంభకోణం కొలిక్కి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 28 : మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో పన్నుల వసూళ్ల ద్వారా వచ్చిన రూ.25లక్షల నగదు దుర్వినియోగంపై ఆడిట్ అధికారుల నివేదిక ఆధారంగా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీనికి బాధ్యులుగా మున్సిపల్ సిటీజెన్ సెంటర్‌లో పనిచేస్తున్న దివ్య అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని మున్సిపల్ కమిషనర్ రాజిరెడ్డి తొలగిస్తూ ఆదేశాలు జారీచేశారు. 2024 మార్చిలో మున్సిపల్ కార్యాలయంలో జిల్లా ఆడిట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పన్నుల వసూలు చేయగా వచ్చిన రూ.25లక్ష లెక్క తేలలేదు. ఈ మొత్తం దుర్వినియోగం చేశారని అప్పట్లోనే తేల్చారు. ఆడిట్ అధికారుల సూచనలతో అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు రూ.20లక్షల వరకు గతంలో మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్, ప్రస్తుత మేనేజర్ శ్రీదేవిల నుంచి రికవరీ చేశారు. మరో నాలుగు లక్షల పైచిలుకు డబ్బు వివరాలు తేలకపోవటంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి దివ్యను బాధ్యురాలిగా చేస్తూ మున్సిపల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణానంతరం రూ.25లక్షలు మొత్తం రికవరీ చేసినా కార్యాలయ డబ్బును సొంతానికి వాడుకున్న దివ్యను డిస్మిస్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.



ప్రాదేశిక ఎన్నికలకు రంగం సిద్ధం!

- లోక్‌సభ ఎలక్షన్లు ముగియగానే 'స్థానిక' ఎన్నికలకు సన్నాహాలు
- ఏర్పాట్లు ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

జిల్లాకు అవసరమయ్యే ఎన్నికల స్టేషనరీపై వివరాల సేకరణ

వికారాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఒకవైపు లోక్‌సభ ఎన్నికల సమరాంగణం కొనసాగుతుండగానే.. మరోవైపు మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడగానే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు వీలుగా సన్నాహాలు చేస్తున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికలను బ్యాలెట్ పేపర్ పద్ధతిలోనే నిర్వహించనున్నారు. బ్యాలెట్ బాక్సులకు బదులు ఈవీఎంలతోనే ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదన ఉన్నా.. ఈ సారికి ప్రాదేశిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలోనే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు తగిన ఏర్పాట్లు సైతం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇప్పటికే సూచించింది. 2019, మే నెలలో విడతల వారీగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం జూలై 4న ముగియనుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ రాజ్ కమిషనర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లు సమకూర్చుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లను హైదరాబాద్ చంచల్‌గూడలో గల ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో వచ్చే నెల 15వ తేదీలోగా ముద్రించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అయా జిల్లాలకు అవసరం అయ్యే ఎన్నికల సామగ్రి, స్టేషనరీ, ఇతర అంశాలపై జెడ్పీ ఉన్నతాధికారులు లెక్కగట్టే పనులు ప్రారంభించారు. మండల పరిషత్ అధికారుల నుంచి సమగ్ర సమాచారాన్ని జిల్లా కేంద్రానికి తెప్పించుకొని అక్కడి నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు తెలియపరుస్తున్నారు.



బీసీ రిజర్వేషన్లపై స్పష్టతొచ్చిన తరువాతనే?


ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాల సంఖ్య, రిజర్వేషన్లకు సంబంధించిన సమాచారం జిల్లాల నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానాల రిజర్వేషన్ల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సేకరించింది. పాత మండలాలతో పాటు కొత్తగా ఏర్పడిన మండలాల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో చౌడాపూర్, దుద్యాల మండలాలు కొత్తగా ఏర్పాయ్యాయి. ఇవి గత స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో మూడుచింతలపల్లి మండలం కొత్తగా ఏర్పడింది. ఇలా కొత్తగా ఏర్పాటైన ఈ మండలాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ నియోజకవర్గాలను పునర్విభజన చేయాల్సి ఉంది. ఎన్నికల మార్గదర్శకాల హ్యాండ్‌బుక్స్, శిక్షణ కార్యక్రమాల పత్రాలు, పుస్తకాలను ముద్రించే విధంగా, సామగ్రిని సిద్ధం చేసుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. రిజర్వేషన్లపై స్పష్టతొచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు మార్గం సుగమం కానుంది.

2019, మేలో జరిగిన ఎన్నికల్లో వికారాబాద్ జడ్పీ పరిధిలో 18 మండలాల పరిధిలో 1,250 పోలింగ్ కేంద్రాలకు 5,625 పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లు అవసరమయ్యాయి. ప్రతీ పోలింగ్ కేంద్రంలో నాలుగు వంతున పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లు అవసరమవుతాయి. జిల్లా అవసరం మేరకు పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లకు అదనంగా మరో 20శాతం ముద్రించాల్సి ఉంది. బ్యాలెట్ బాక్సులకు పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌లు అతికించాలి. పేపర్ సీళ్లతో పాటు పోలింగ్ కేంద్రం, గ్రామం, మండలం, జిల్లా వివరాలను సూచించే ట్యాగ్‌లపై తెలుగు, ఇంగ్లీష్ అక్షరాల్లో ముద్రిస్తారు. జిల్లాలో అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జడ్పీ అధికారులకు సూచించింది.



ఎండ వేడిమి తట్టుకోలేక కానుగ మండలు కప్పుకొని బైక్‌పై ప్రయాణం చేస్తున్న వాహనదారులు

భగభగలు..!



ఘన్‌పూర్‌లో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్ (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 28 : భానుడు భగ్గుమంటున్నాడు. ఉమ్మడి జిల్లా ప్రజలపై సెగలు కక్కుతున్నాడు. భానుడి భగభగలకు ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు ఓ రేంజ్‌లో పెరిగిపోతున్నాయి. దీంతో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు నిప్పుల గుండంగా మారిపోయాయి. జనం అడుగు బయటకు పెట్టేందుకు జంకుతున్నారు. రేపు, ఎల్లుండి జాగ్రత్తగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఘన్‌పూర్‌లో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మృగవణి పార్కు సమీపంలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం నాగారంలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఇదే జిల్లా పూడూరు మండలం మన్నేగూడలో 42.9, కులకచర్ల మండలం పుట్టపహాడ్‌లో 42.9, మోమిన్‌పేట్‌లో 42.6, మర్పల్లిలో 42.6, కోట్‌పల్లిలో 42.5, బంట్వారంలో 42డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే జిల్లాలోని అన్ని మండలాల్లోనూ 40 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రత నమోదైంది. మండుతున్న ఎండలతో రోడ్లపైకి రావడానికి ప్రజలు జంకుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో వృద్ధులు, చిన్న పిల్లలు రోజురోజుకూ పెరిగిపోతున్న ఎండలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం 10 గంటల మొదలు సాయంత్రం 6గంటల వరకు సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మునుపెన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎప్పుడూ రద్దీగా ఉండే శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి మధ్యాహ్నం వేళల్లో వారం రోజులుగా ఎండల తాకిడికి బోసిపోయి కన్పిస్తోంది. ఎండలతో కొనుగోళ్లు లేక గిరాకులు కూడా తగ్గాయని వ్యాపారులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా మండుతున్న ఎండలు సీజనల్ వ్యాపారులకు మాత్రం కలిసొచ్చింది. తాపాన్ని తీర్చుకుందుకు ప్రజలు పండ్లు, శీతల పానీయాలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో వాటి విక్రయాలు జోరందుకున్నాయి.



రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన శ్రీశైలం-హైదరాబాద్ రహదారి

ఎన్నికల్లో కోఆర్డినేటర్లుగా మేడ్చల్ కాంగ్రెస్ నేతలు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 28: ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులకు పార్టీ అధిష్టానం మెదక్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో కోఆర్డినేటర్లుగా నియమించింది. మేడ్చల్ పట్టణం అత్వెల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రొయ్యపల్లి మల్లేష్‌గౌడ్‌ను పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా, మండలానికి చెందిన సీనియర్ నాయకులు మల్లారెడ్డికి మెదక్ పార్లమెంట్ పరిధిలోని నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్, సురేందర్ ముదిరాజ్‌ను గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ కోఆర్డినేటర్లుగా నియమిస్తూ బాధ్యతలు అప్పగించారు.

ఆలయ కమిటీ ఎన్నిక

దోమ, ఏప్రిల్ 28: మండలంలోని దిర్సంపల్లి గ్రామంలో శివాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా లక్ష్మీనారాయణగౌడ్, వైస్‌చైర్మన్‌గా పిట్టలి మోహన్, ప్రధాన కార్యదర్శిగా కుర్వ మల్లేశం, కార్యదర్శిగా దోడ జగదీశ్వర్‌రెడ్డి, కార్య నిర్వహణ అధికారిగా యం.సతీశ్‌కుమార్, సభ్యులుగా బి.తిరుపతి, సి.సత్తయ్య, రాములుగౌడ్, మహిపాల్‌రెడ్డి, రాజు, పి.హనుమంతును ఎన్నుకున్నారు.



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

యజ్ఞ ఫౌండేషన్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్

వికారాబాద్, ఏప్రిల్ 28: వికారాబాద్ పరిధిలోని ధన్నారం స్వామి వివేకానంద గురుకుల్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ పాఠశాలలో గ్రామీణ ఎస్సీ, ఎస్టీ పిల్లలకు పూర్ణ వికాస్ ఉచిత రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉజ్వల్ తెలిపారు. యజ్ఞ ఫౌండేషన్‌లో ఆదివారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరం మే 24 వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు అవుట్ డోర్ గేమ్స్‌లో భాగంగా ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, మల్లఖాన్స్, టైక్వాన్ డో, స్విమ్మింగ్, ఇండోర్ యాక్టివిటీస్‌లో భాగంగా టేబుల్ టెన్నిస్, చదరంగం, సైన్స్ ఆడియో విజువల్ యాక్టివిటీలు నేర్పించనున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక, విద్య, యోగా, పుస్తకపఠనం, మైండ్ మేనేజ్‌మెంట్ గేమ్స్, క్రాఫ్ట్ డ్రాయింగ్ తదితర వాటిని నేర్పిస్తామని తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం పిల్లలు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి

» కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : దేశాభివృద్ధి ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మదన్‌పల్లిలోని వివిధ పార్టీలకు చెందిన వందమంది కార్యకర్తలు ఆయన సమక్షంలో గ్రామంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం ఎంతో అభివృద్ధి సాధించిందని, కేంద్రం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేంరాజ్, జిల్లా నాయకులు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వృథా

కందుకూరు : ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని.. అభ్యర్థి లేక ఇతర పార్టీ నుంచి అరువు తెచ్చుకున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచులూరు సర్పంచ్, బీఆర్‌ఎస్ నేత శ్రీనివాసచారి ఆధ్వర్యంలో పలువురు నేతలు నగరంలో కొండా సమక్షంలో పార్టీలో చేరారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరులా మారుతుందన్నారు. ఈ ఎన్నికల్లో తనకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, నాయకులు పున్న భిక్షపతి, ఆంజనేయులు, రవీందర్, యాదగిరి, శ్రీశైలం, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

శంషాబాద్ : బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తుందని, ప్రజలు నమ్మవద్దని విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఓర్వలేకనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేపట్టిందన్నారు. శంషాబాద్‌లో ఆదివారం రాత్రి బైక్‌ర్యాలీ చేపట్టి, ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో మాట్లాడారు. రాహుల్‌గాంధీ గెలువలేనన్న భయంతోనే అత్యధిక ముస్లిం ఓటర్లు ఉన్న వయనాడ్ నుంచి పోటీ చేస్తున్నారని, ఇది సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రేంరాజ్ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి కన్వీనర్ మల్లేష్‌యాదవ్, భీమార్జున్‌రెడ్డి, తదితరులున్నారు.

మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్

రాజేంద్రనగర్ : కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిందని, పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి పప్పులు ఉడకవని, 12 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యత సాధించబోతున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. బీజేపీ శ్రేణులతో కలసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి డివిజన్లలో ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. హైదర్‌గూడ సుభాష్ విగ్రహం వద్ద మాట్లాడుతూ రాహుల్ హిందువులకు ప్రతినిధి కాదా? అని ప్రశ్నించారు.



పరిగి: ప్రచారం నిర్వహిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

మచ్చలేని మహానేత 'కొండా'

తాండూరు/పూడూరు/వికారాబాద్/ధారూరు/కులకచర్ల/పెద్దేముల్/హైదర్‌నగర్ : అవినీతి, స్కామ్ ఆరోపణలు లేని మచ్చలేని మహా నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నరేష్ మహరాజ్ అన్నారు. తాండూరు బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భారీ మెజార్టీ కోసమే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. విక్రం, పట్టణ మాజీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు. కాగా, పరిగి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడం విశ్వేశ్వర్‌రెడ్డికే సాధ్యమని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి అన్నారు. పరిగి నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, గడిసింగాపూర్ గ్రామాలతోపాటు పరిగి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. కొండా సంగీతారెడ్డి ఆధ్వర్యంలో యువకులు, మహిళలు వందలాదిగా తరలివచ్చి బీజేపీలో చేరారు. కాగా, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ మోదీ చలవేనని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పరిధిలోని పెండ్లిమడుగు, నారాయణపూర్, పులుమద్ది, ఎర్రవల్లి, మదన్‌పల్లి, మైలార్ దేవరంపల్లి, పీలారం, రాళ్ల చిట్టంపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్ వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శివారెడ్డిపేట, కొత్రేపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. కొత్రేపల్లి, వెంకటపూర్ నుంచి 100మంది యువకులు బీజేపీలో చేరారు. విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ శ్రేణులు ధారూరు మండలంలోని మోమిన్‌కుర్దు, రాజాపూర్, పీసీఎం తండా, గురుదోట్ల, అంపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. అల్లాపూర్‌లో నాయకులు ప్రచారం నిర్వహించారు. పెద్దేముల్ మండలం మారెపల్లి, మంబాపూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ మాదిగ ప్రచారం చేశారు. విశ్వేశ్వరరెడ్డికి మద్దతుగా ఆయన సోదరి అనితారెడ్డి హైదర్‌నగర్‌లో ప్రచారం చేశారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం

» రేపటి నుంచి తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

» తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు

» ముస్తాబైన దేవాలయం



భావిగి భద్రేశ్వర స్వామి మూలవిరాట్

తాండూరు, ఏప్రిల్ 28: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా, భక్తుల ఇలవేల్పుగా తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి ఆలయం ఎంతో పేరుగాంచింది. ఈ ఆలయం ఇప్పుడు బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఏటా చైత్ర బహుళ అమావాస్య నుంచి ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని మొక్కుకుంటే పెళ్లిళ్లు కానివారికి పెళ్లిళ్లు అవుతాయని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ ఆలయానికి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అంతేకాదు ఇరురాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు ఉత్సవాల్లో ఉట్టిపడతాయి. వీరశైవ సమాజము, వీరశైల యువదళ్ ప్రతినిధులు ఉత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తున్నారు. ఈవో శేఖర్ ఆధ్వర్యంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.



భద్రేశ్వర స్వామి ముఖ ద్వారం

కార్యక్రమాల వివరాలు

ఈనెల 30, మే 1వ తేదీన (రెండు రోజులు) రాత్రి 10గంటలకు గాంధీ చౌక్, రాచన్న ఆలయం వరకు పల్లకీసేవా, మే 2వ తేదీన గాంధీ చౌక్-రాచన్న దేవాలయం, గంజ్ వరకు పల్లకీ సేవ, 3వ తేదీన రాత్రి 2గంటలకు ఆలయం నుంచి పేరూరుగల్లి, గాంధీచౌక్, మెయిన్ రోడ్డు పాత కూరగాయల మార్కెట్ వరకు, పల్లకీ సేవా కార్యక్రమం ఉంటుంది. 4న కళాశాల ఊరేగింపు, రథోత్సవం, 5న పల్లకీసేవ, లంక దహనం, 6, 7తేదీల్లో ఆలయంలో ప్రత్యేకపూజలు, 8వ తేదీన కళాశందిచుటతో ఉత్సవం సమాప్తి అవుతుంది. ఈనెల 30వ తేది నుంచి మే 5 వరకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. మే 5వ తేదీన సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో పశుప్రదర్శన నిర్వహిస్తారు.

ఉపాధి పనుల తనిఖీకి ప్రత్యేకాధికారులు

» మూడు విడతలుగా తనిఖీ చేయనున్న రాష్ట్ర అధికార బృందం

» ఎనిమిది అంశాల ప్రాతిపదికన తనిఖీ

తాండూరు, ఏప్రిల్ 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్రస్థాయి స్థాయి బృందాన్ని నియమించారు. జిల్లాల వారీగా నియమించిన బృందం ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లి అక్కడ పనులు ఎలా జరుగుతున్నాయి? కూలి ఎంత ఇస్తున్నారు? కనీస సౌకర్యాలు ఉన్నాయా? అనే అంశాలపై ఈ బృందం ఆరా తీస్తుంది. వికారాబాద్ జిల్లాకు సీఆర్‌డీ హైదరాబాద్‌కు చెందిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మమత, రాష్ట్ర ప్రత్యేకాధికారిగా తమ జిల్లా ప్రత్యేకాధికారులుగా ప్లానిటేషన్ మేనేజర్ కె.శివరాములు, ఎఫ్ అండ్ ఏఎం అధికారి శ్రీనివాస్‌లు నియమితులయ్యారు వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో ఈ అధికారుల బృందం పర్యటించనున్నారు. మేడ్చల్‌లో మొదటి విడతగా ఈనెల 30వ తేదీన, వికారాబాద్‌లో మే1న, రెండో విడతగా మే 8న, వికారాబాద్‌లో మే 9న మేడ్చల్‌లో, మూడోవ విడతగా మే 15న మేడ్చల్, 16న వికారాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ బృందం పని ప్రదేశాల్లో మెడికల్, ఫాస్ట్ ఎయిడ్ కిట్లు, మంచి నీటి వసతి, నీడ వంటి సౌకర్యాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. నిబంధనలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా? లేదా అనే అంశాలను పరిశీలిస్తారు. 8.1 అంశాలను ప్రత్యేకంగా ఈ బృందం పరిశీలిస్తుంది. డీఆర్డీవో ఆధ్వర్యంలో జిల్లాల్లో ఈ బృందం పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను ఖరారు చేస్తారు. తనిఖీ చేసిన వివరాలను రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికలను సమర్పిస్తారు.

నీటి అక్షయపాత్రలా అనంతపద్మనాభ స్వామి గుండం



అనంతపద్మనాభస్వామి

మర్పల్లి, ఏప్రిల్ 28: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా నదులు, చెరువులు, కుంటల్లో నీటిమట్టం అడుగంటిపోతున్నా మండలంలోని కల్కోడలో గల అనంతపద్మనాభస్వామి ఆలయ గుండంలో రోజురోజుకూ నీటిమట్టం పెరుగుతూ స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కల్కోడ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయానికి ఘన చరిత్రే ఉంది. స్వామివారిని దర్శించుకునేందుకు గ్రామంతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివస్తారు. గతంలో ప్రతీ వేసవిలో గుండంలో నీరు అడుగంటేది. కానీ ఈ సంవత్సరం రోజురోజుకూ నీటి గుండంలో నీటి మట్టం పెరుగుతోంది. స్వామివారి ఆలయం ప్రాంగణంలో కోతులు, పక్షులు వచ్చి గుండం నీటితో దాహార్తిని తీర్చుకుంటున్నాయి. గుండంలో నుంచి జలధార మాదిరిగా వచ్చి చేరడంతో ఆ గుండం నీటితో నిండి ఉంది. నీటి మట్టం పెరగడంతో చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.



గుండం నీటితో శివలింగానికి అభిషేకం



అనంతపద్మనాభస్వామి గుండంలో పెరిగిన నీటి మట్టం

గుండంలో రోజురోజుకూ పెరుగుతున్న నీటి మట్టం

కొన్ని రోజులుగా అనంతపద్మనాభస్వామి ఆలయ ఆవరణలో గుండం పక్క నుంచి నీటి శబ్దం వస్తోంది. ఆ నీరంతా గుండంలో చేరి నీటి మట్టం పెరుగుతోంది. కొత్తగా వచ్చి చేరుతున్న నీరు గుండం నుంచి బయటకు వెళ్తున్నా నీటి మట్టం తగ్గడం లేదు. గతంలో ప్రతీ వేసవిలో గుండంలో నీటి మట్టం అడుగంటేది. కానీ ఈ ఎండ కాలంలో వానకాలం కంటే ఎక్కువగానే నీరు గుండంలో చేరుతోంది. అంతే మొత్తంలో కిందికి వెళ్తోంది. ఈ నీటితో పశువులు, వన్యప్రాణులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. ఇది శుభపరిణామం. స్వామివారి దయతోనే ఇది సాధ్యమైంది.

బీజేపీ వస్తే రిజర్వేషన్లు పోతాయ్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 28: దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు పోతాయని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలంఎన్కేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో రంజిత్‌రెడ్డి జిల్లాకు చెందిన వికలాంగుల సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి కేవలం టూర్ల వ్యక్తి అని.. నియోజకవర్గ అభివృద్ధికి ఏనాడూ కృషి చేయలేదని ఆరోపించారు. కొవిడ్ సమయంలో ప్రజల ముందు తానే ఉన్నానని.. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాత్రం విదేశీ యాత్రలో నిమగ్నమయ్యారన్నారు. రంగారెడ్డి జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు వడ్ల నర్సింహచారి, నాయకులున్నారు.

యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలి

పెద్దేముల్ : పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. పెద్దేముల్ మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం తాండూరు మండలం అంతారం గుట్టపైన ఏర్పాటు చేసిన మండల యూత్‌కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు.

జోరుగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

ధారూరు/పూడూరు/తాండూరు: ధారూరు మండలంలో రంజిత్‌రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేశారు. పూడూరు మండలం సిరిగాయిపల్లిలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జిల్లా ఆర్టీఏ మాజీ మెంబర్ జావీద్‌తో పాటు మరికొంత మంది ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తాండూరు పట్టణానికి చెందిన చంద్, 50మంది బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, జడ్పీటీసీ ధారాసింగ్, మైనార్టీ నాయకులు అబ్దుల్ రవూఫ్ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపునకు సహకరించాలి

కందుకూరు/చేవెళ్ల : రంజిత్‌రెడ్డి గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చనున్నట్లు పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డిలు అన్నారు. ఏనుగు జంగారెడ్డి మండలంలోని దెబ్బడగూడలో ప్రచారం నిర్వహించగా, జడ్పీటీసీ కందుకూరులో ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీలను ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా దెబ్బడగూడకు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పలువురు ఏనుగు జంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా, కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎన్డీఏ అధికారంలో ఉన్నా అభివృద్ధి శూన్యం

షాబాద్ : దేశంలో ఎన్డీయే పదేళ్లు అధికారంలో ఉన్నా- అభివృద్ధి శూన్యమని ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చర్లగూడ, యెల్గొండగూడ, ఆస్పల్లిగూడ, ఉబ్బగుంట, గొల్లూర్‌గూడ గ్రామాల్లో రంజిత్‌రెడ్డికి ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరుతూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులున్నారు.



చర్లగూడలో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి



రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం గడ్డ.. కాంగ్రెస్ అడ్డా

మహేశ్వరం : మహేశ్వరం కాంగ్రెస్‌కు అడ్డాగా తయారు అవుతుందని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం గంగారం, గంగారం తండాలకు చెందిన 200 మంది బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కె.రఘుమారెడ్డి, కృష్ణానాయక్, పాండునాయక్ పాల్గొన్నారు. చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్, దేవరంపల్లి, కుమ్మెర, ధర్మసాగర్ గ్రామాల్లో విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు.

ప్రజా సంక్షేమాన్ని కోరుకునే పార్టీ కాంగ్రెస్

ఎల్బీనగర్/సరూర్ నగర్: కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని కోరుకునే పార్టీ అని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని డాక్టర్స్‌కాలనీ, జేబీకాలనీ, డాక్టర్స్‌కాలనీ సౌత్‌లలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం చేశారు. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో స్వాతి, టీచర్లు, చిన్నారులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని కాచవానిసంగారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో స్వాతి పాల్గొని మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అదేవిధంగా మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని టీచర్లను ఆదేశించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపరింటెండెంట్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు రజిని, సరస్వతి, ఉమారాణి, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తాండూరు, ఏప్రిల్ 28: తాండూరు పట్టణంలోని విజయ్ విద్యాలయ హైస్కూల్‌లో 1947 నుంచి 2024 దాక చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకేచోట చేరారు. ఏళ్ల కిందట కలిసి చదువుకున్న వారంతా ఒక్కొక్కరు ఒక్కోచోట స్థిరపడ్డారు. వారి జీవిత అనుభవాలతో పాటు వారి పాఠశాల మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి గురుభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, ఉపాధ్యాయులు మల్లెపల్లి వెంకటేశం, అలంపల్లి సిద్దన్న, నారాయణ, నర్సిరెడ్డి, దత్తాత్రేయ, పాఠశాల యజమాన్యం ప్రతినిధి సత్యనారాయణ బుబ్, ప్రముఖ న్యాయవాది విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్‌లు శెట్టి రమేష్, సుభాష్ సింగ్ ఠాకూర్ , ఆనందం, రాఘవేందర్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో స్టేట్ 3వ ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



అనిల్‌కుమార్‌ను సన్మానించిన ఎంపీపీ ముద్దప్ప

కొడంగల్, ఏప్రిల్ 28: మండలంలోని బుల్కాపూర్ గ్రామానికి చెందిన కుర్వ అనిల్‌కుమార్ ఇటీవల ఇంటర్ బోర్డు ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో యంపీసీ గ్రూపులో 470 మార్కులకు 466 సాధించి స్టేట్ 3వ ర్యాంకు సాధించాడు. దీంతో ఆదివారం ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ ఛైర్మన్ శివకుమార్‌గుప్త, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ ఉషారాణి రాజేందర్, డీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థచారి, భాస్కర్, వైద్యుడు సాకేత్ విద్యార్థిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు.

రామంతాపూర్‌లో బీఆర్ఎస్ భారీ రోడ్ షో



రోడ్‌షోలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ ఏడీఆర్ఎం ఆసుపత్రి వద్ద నుంచి రాంశంకర్‌నగర్ వరకు శనివారం రాత్రి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ముస్తాక్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షోకు అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ.. కల్లబొల్లి కబుర్లు, మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్, మతతత్వ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కారు గుర్తుపై ఓటువేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అమలుకు సాధ్యం కాని హామీలు

ఘట్‌కేసర్: కాంగ్రెస్ అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని పలుకాలనీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడుతూ కేంద్రంలో బీఆర్ఎస్‌కు అవకాశం కల్పిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి వీలు కలుగుతుంది కనుక బీఆర్ఎస్ అభ్యర్థి ఐన తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చామకూర భద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాధవరెడ్డి, హరిశంకర్ , రమాదేవి, వెంకటరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో ప్రజలకు మేలు



ప్రతాప్‌సింగారంలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట, ఏప్రిల్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరుగ్యారెంటీలతో ప్రజలు మేలు జరుగుతోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి తెలిపారు. ప్రతాప్ సింగారంలో ఆదివారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని, అ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంజయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ అబేదాబేగం, నాయకులు బద్దం కుమార్, బాల్‌రాజ్, శివ, సాయి, మల్లేష్ పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేటలో పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దమ్మ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిశోర్‌యాదవ్, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



ఘట్‌కేసర్ రూరల్: ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ కన్వీనర్ బట్టె శంకర్

ఘట్‌కేసర్ రూరల్/ శామీర్‌పేట/ నాచారం/ తిరుమలగిరి ఏప్రిల్ 28: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడతుందని మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. మండలంలోని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ కన్వీనర్, ఎదులాబాద్ మాజీ సర్పంచ్ బట్టె శంకర్ తన 40మంది అనుచరులతో ఆదివారం శామీర్‌పేటలోని ఈటల ఫాంహౌజ్‌లో ఆదివారం బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ పార్టీలో చేరిన నాయకులకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బట్టె లక్ష్మన్‌రావు, ఎంకే నాగరాజు, మోహన్‌రెడ్డి, నరేష్, రంజిత్, నందు, మనీ, అఖిల్, చిత్తరంజన్, నాగేష్ తదితరులకు కండువా కప్పి పార్టీలో అహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా ఈటల రాజేందర్ నివాసం వద్ద బీజేపీ నాయకుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్ సమక్షంలో శామీర్‌పేట గ్రామం, పెద్దమ్మ కాలనీకి చెందిన పంచాయతీ వార్డు మాజీ సభ్యుడు ఉప్పలయ్యతో పాటు దాదాపు 100మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. నాచారం డివిజన్‌లో ఈటల రాజేందర్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా కంటోన్మెంట్ నియోజకవర్గం వార్-7 అరుణ్ ఎన్‌క్లేవ్‌లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ నేతృత్వంలో జరిగిన కాలనీవాసుల సమావేశంలో ఈటల ముఖ్య అతిథిగా పాల్గొని సీఎంపై విమర్శలు గుప్పించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట/ వినాయకనగర్/హయత్‌నగర్/కొత్తపేట/ఫతేనగర్/మౌలాలి: ఘట్‌కేసర్ పరిధి అంకుషాపూర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు ఆదివారం ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా శామీర్‌పేట మండలం తూంకుంటలో మండల బీజేపీ నాయకులు కాసుల కరుణాకర్ గౌడ్, కాసుల సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కోడలు ఈటల క్షమిత పార్టీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. అదేవిధంగా అదేవిధంగా వినాయకనగర్ డివిజన్‌లోని సాయికుటీర్, ఈస్ట్ కాకతీయనగర్‌లలో ఈటల సతీమణి జమున ప్రచారంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మీతో పాటు మహిళ నాయకులు పాల్గొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని కొలన్ శివారెడ్డికాలనీ, టీ. నగర్‌కాలనీలలో ఆదివారం ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమునతో కలిసి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగోల్ నాయకులుఆదివారం నాగోల్ శుభం ఫంక్షన్‌హాల్ ఆవరణలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంగా శ్యాంకుమార్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. అదేవిధంగా బీజేపీలో ఇటీవల చేరిన సీనియర్ నాయకుడు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి సమక్షంలో 20 మంది స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. నాగోల్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నెం.92 పరిధిలో పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఫతేనగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన వెంట కంచి మహేందర్, కృష్ణగౌడ్, రామ్మోహన్ ఉన్నారు. మౌలాలి డివిజన్‌లోని కార్పొరేటర్ గున్నాల సునీతయాదవ్ కార్యాలయంలో, వినాయకనగర్ డివిజన్ సూర్యోదయ ఫంక్షన్‌హాల్‌లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, తమిళనాడు రాష్ట్ర ఎమ్మెల్యే ప్రేమకుమారి బూత్‌స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. గౌతంనగర్ డివిజన్‌లోని సాయినగర్, యాదవ్ నగర్, సంజయ్‌నగర్‌లలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో, మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని కృపా ఆనంద్ అపార్ట్‌మెంట్స్‌లో బీజేపీ కార్యకర్తలు ప్రచారం చేశారు.

అందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యం

- పంచాయతీల్లో కూలీల పెంపుపై అధికారుల దృష్టి
- 60శాతం కూలీలు పనులకు వచ్చేలా చర్యలు



పని ప్రదేశం వద్ద కూలీలతో బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు, ఈసీ నర్సింహారెడ్డి

బషీరాబాద్, ఏప్రిల్ 28: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం సూచించింది. ప్రతీ మేజర్ పంచాయతీలో నిత్యం 200మంది కూలీలకు తక్కువ కాకుండా పనులు చూపాలని జిల్లా యంత్రాంగం పేర్కొంది. ఈక్రమంలో మండల స్థాయి అధికారులు ఉపాధి కూలీల సంఖ్య పెంపుదలపై దృష్టి సారించారు. ఈ ఏడాది వీలైనంత ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి గ్రామాల వారీగా ప్రగతి పనులపై అధికారకులు సమావేశాలు నిర్వహిస్తూ సమీక్షిస్తున్నారు. రోజు వారీగా కూలీల హాజరుపై గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరా తీస్తున్నారు. బషీరాబాద్ మండలంలో 36గ్రామ పంచాయతీలు ఉండగా మొత్తం 12,879 జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో కూలి పనులు చేసే జాబ్ కార్డుల సంఖ్య 11,350వరకు ఉంది. అయితే ఏటా సుమారు 5వేల నుంచి 6వేల మంది కూలీలు ఉపాధి పనులకు వస్తుంటారు. అధికారిక లెక్కల ప్రకారం ఈఏడాది ఇప్పటి వరకు 4,775మంది కూలి పనులు చేస్తున్నారు.

కూలి పెరిగినా అనాసక్తి

ఉపాధిహామీ పథకంలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కూలీల వేతనాలు పెరిగాయి. గతంలో కూలీలకు రూ.272 చెల్లించేవారు. ఈ కూలిని ఇటీవల రూ.300వరకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఇదిలాఉండగా బయట వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు వెళ్తే నిత్యం రూ.800 నుంచి రూ.1,000 వరకు వస్తుండటంతో కూలీలు ఉపాధి పనులపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదు. ఒకవైపు ఎండలు మండుతుండటం, పనుల వద్ద సరైనా సౌకర్యాలు వంటివి లేక కూలీలు పలుచోట్ల వెనకడుగు వేస్తున్నారు. సంబంధిత అధికారులు ఎంత అవగాహన కల్పించినప్పటికీ కూలీల నుంచి స్పందన అంతగా రావడంలేదు. దీంతో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఈసీ వేర్వేరుగా నిత్యం ఒకటి, రెండు గ్రామాలను పర్యటిస్తూ కూలీల సంఖ్యలో 60శాతం కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీవో రాఘవులు నిత్యం గ్రామాల వారీగా ఉపాధి పనులకు వచ్చే వారి వివరాలు తెలుసుకుంటూ లక్ష్యం మేరకు కూలీల సంఖ్యను పెంచే దిశగా కృషి చేస్తున్నారు.

శుభకార్యాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న రోహిత్‌రెడ్డి

పెద్దేముల్, ఏప్రిల్ 28: మండలంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలకు తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి హాజరయ్యారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షులు కోహిర్‌శ్రీనివాస్ నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై శ్రీనివాస్‌ను అభినందించారు. కందనెల్లి గ్రామ సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌లో జరిగిన గాజీపూర్ గ్రామానికి చెందిన తడకల శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

నేడు బషీరాబాద్‌లో ప్రచారం

బషీరాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(సోమవారం) బషీరాబాద్ మండలంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి పర్యటించనున్నారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి తెలిపారు.

వైభవంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ



పేర్కంపల్లి బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

యాలాల, ఏప్రిల్ 28: మండలంలోని పేర్కంపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల నాయకులు, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- బైరంపల్లిలో బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కొందుర్గు, ఏప్రిల్ 28: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బైరంపల్లిలో బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వారు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతీ ఒక్కరు ఏదో ఒక రకంగా ఒత్తిడికి గురవుతున్నారని, దైవ చింతన అలవర్చుకోవాలని, దీనిద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, సున్నాల శ్రీనివాస్, రామయ్య, యాదయ్య, అంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొందుర్గు : పూజల్లో పాల్గొన్న అంజయ్య యాదవ్, గ్రామస్థులు

కనుల పండువగా రథోత్సవం



తలకొండపల్లి : రథాన్ని లాగుతున్న భక్తులు

తలకొండపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వెంకటాపూర్ లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ చైర్మన్ తిరుమణి శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్ రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వెంకటాపూర్‌తో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రథాన్ని శోభాయమానంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలను ఉంచి తాళ్లతో లాగారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, అర్చకులు యాదగిరి నర్సింహ శాస్త్రి, కామేశ్వర మూర్తి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

కడ్తాల్, ఏప్రిల్ 28: మండలంలోని చల్లంపల్లి గ్రామంలోని శివాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆలయ ఆవరణలో గ్రామస్థులు సమావేశమై కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షులుగా బొజ్జ ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుర్క అంజయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్ యాదవ్, కార్యదర్శులుగా మంతపురం చంద్రశేఖర్, చల్ల పవన్ కుమార్‌రెడ్డి, జక్కు బాల్‌రెడ్డి, కోశాధికారిగా పెద్ద మోని శ్రీనివాస్, సభ్యులుగా చల్లా అశోక్ రెడ్డి, మాలే రమేశ్ గౌడ్, అనుముల శ్రీశైలం, వడ్డెమోని శ్రీశైలం, పెద్దమోని శ్రీశైలం, కొట్ర రాంరెడ్డి, ప్రచార కార్యదర్శులుగా నాయిని శ్రీరామ్, మర్ల ప్రేమ్ రాజ్ యాదవ్, ధర్మకర్తలుగా అంకిత్ శాస్త్రీ, విద్యాసాగర్, మాదవ రెడ్డి, దామోదర్ రెడ్డి, చిన్న నారాయణ గౌడ్, పర్వతాలు యాదవ్, లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీశైలం గౌడ్, కృష్ణయ్య, జంగయ్య లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై గ్రామస్థులు తీర్మానించారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 28: చిన్నపాటి గొడవ కారణంగా ఓ వ్యక్తిని మినీ గ్యాస్ సిలిండర్‌తో నెత్తిపై బాది దారుణంగా హతమార్చారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లక్కు(40) జీవనోపాధి నిమిత్తం మేడ్చల్ మండలంలోని మురాహరిపల్లిలో జీవనం సాగిస్తున్నాడు. అతడికి రాజు అనే వ్యక్తితో మూడు రోజుల రిందట గొడవ జరిగింది. దీంతో అదివారం సాయంత్రం లక్కు గ్రామంలోని లక్ష్మీదుర్గా షాపులో షట్టర్ వద్ద నిద్రిస్తుండగా రాజు మినీ గ్యాస్ సిలిండర్‌తో లక్కు తలపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లక్కు రక్తపుమడుగులో అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం నిందితుడు జినామీ వాలి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బంట్వారం (కోట్‌పల్లి) ఏప్రిల్ 28: కుటుంబ కలహాలతో ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బర్వాద్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బర్వాద్ గ్రామానికి చెందిన పెద్దోళ్ల నర్సింహులు(46)కు ఉన్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారం రోజుల కిందట నర్సింహులు బైక్‌పై మోమిన్‌పేటకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి పడటంతో అయనకు తీవ్రగాయాలయ్యాయి. ఆ తర్వాత కుటుంబ కలహాలతో నర్సింహులు భార్య లలిత గొడవపడి ఆమె తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుటుంబసభ్యులకు అప్పగిస్తామని ఆమె తెలిపారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

- కడుపునొప్పి భరించలేక అఘాయిత్యం!

చేవెళ్ల, ఏప్రిల్ 28 : ఆరోగ్యం బాగోలేదని వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్‌పరిధిలోని ఊరెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఊరెళ్లకు చెందిన మంగలి పార్వతమ్మ(65)కు కొన్ని రోజుల క్రితం గర్భసంచి ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఆమె తరచూ కడుపునొప్పితో బాధపడుతోంది. ఈక్రమంలో ఆరోగ్యం బాగుపడటం లేదని మనస్తాపం చెందిన పార్వతమ్మ శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. గ్రామ శివారులోని ఊరడి ధర్మయ్య వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. రోజూ మాదిరిగానే గ్రామంలో తెలిసినవారి ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు భావించారు. కానీ, రాత్రి 8 గంటలు దాటినా ఇంటికి రాకపోడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వెతికినా ఎక్కడ ఆచూకీ దొరకలేదు. రాత్రి సమయంలో గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావిలో చూడగా పార్వతమ్మ మృతదేహం నీటిపై తేలి ఉండటాన్ని గమనించారు. దాంతో పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్తులతో సాయంతో బయటకు తీయించారు. అదేరాత్రి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆదివారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

అక్రమంగా మట్టి తరలింపు.. టిప్పర్ స్వాధీనం

కేశంపేట, ఏప్రిల్ 28: మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం కేశంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేశంపేట మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి సీజ్ చేసుకున్నట్లు ఎస్సై లింగం తెలిపారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28 : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన ఆదివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సుల్తాన్‌పల్లికి చెందిన మైలారం శ్రీనాథ్(38) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. చౌదరిగూడలోని సిద్ధాంతి బస్తీకి చెందిన మంచర్ల శ్రీనివాస్ ఫాంహౌస్‌లో కరెంట్ సమస్య ఉందని పనికి వెళ్లాడు. పనులు చేస్తుండగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన తోటి పనివారు ఫాంహౌస్ యజమాని శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన శ్రీనాథ్ మృతి చెందడంతో ఆ కుటుంబ రోడ్డునపడింది. భార్య, పిల్లలు బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28: షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ పెట్రోల్ పంప్ ఎదురుగా ఆదివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తిమృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం తెలిపారు. షాద్‌నగర్‌కు చెందిన బస్సు(ఏపీ 21జడ్ 0086) చౌదరిగూడ మండలం పీర్జాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి షాద్‌నగర్ డిపోకు వస్తుండగా జడ్చర్ల రోడ్డులో ఉన్న ఆర్టీసీ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటోంది. ఈక్రమంలో బస్సు టైర్‌కింద పడి గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సు ముందు టైరు తల మీదుగా వెళ్లడంతో మెదడు చిట్లిపోయింది. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై బ్లాక్ కలర్ ప్యాంటు, వైట్ కలర్(చెక్స్) షర్టు ఉందని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



హస్నాబాద్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికలో చేయి గుర్తుకు ఓటేయాలని ఓటర్లతో అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, శివకుమార్‌గుప్త, ఉషారాణి రాజేందర్, భీములు, భాస్కర్, మల్లు, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నూతన కమిటీ

షాబాద్, ఏప్రిల్ 28: బీజేవైఎం నూతన కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు దాదె మహేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శులుగా రాఘవేందర్, శ్రీధర్, ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, స్వామి, హరికృష్ణ, శ్రీహరి, విక్రమ్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా గోపాలకృష్ణ, నరేష్, భాస్కర్, శ్రీశైలం, ఆంజనేయులు, శివారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులుగా కిరణ్, అరుణ్, భవదీష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నియామకపత్రాలు అందజేశారు.